# హెచ్‌ఎండీఏలో మారనున్న ప్రాజెక్టుల ప్రాధాన్యత

**ప్రతిపాదిత ప్రాజెక్టులపై లోతైన సమీక్ష తర్వాతే ముందడుగు**

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రాజెక్టులు చేపడుతున్నది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా పని చేస్తున్న హెచ్‌ఎండీఏ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ప్రాజెక్టుల కోసం పెద్ద మొత్తంలో నిధులను వెచ్చిస్తున్నది. ముఖ్యంగా గ్రేటర్ చుట్టూ 50 కి.మీ వరకు విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, పచ్చదనం పెంపొందించడం వంటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతూ వస్తున్నది. పట్టణీకరణ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు హెచ్‌ఎండీఏ ప్రాధాన్యతనిస్తున్నది. అందులో భాగంగానే గత కేసీఆర్ ప్రభుత్వం పలు ప్రాజెక్టులకు ప్రతిపాదనలు రూపొందించడంతోపాటు కొన్ని ప్రాజెక్టులకు టెండర్లను సైతం పిలిచి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేశారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కొనసాగించడంలో జాప్యం జరుగుతున్నది. హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా దానకిశోర్, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఆమ్రపాలి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్కో విభాగంపై సమీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, ఎస్టేట్ విభాగాలపై మెట్రో పాలిటన్ కమిషనర్ ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు. మిగతా విభాగాలపై సమీక్షలు పూర్తికాకపోవడంతో ప్రాజెక్టుల పనులు చేపట్టడంలో ఎలాంటి పురోగతి కనిపించడంలేదు. ప్రాజెక్టుల వారీగా సమీక్ష చేసిన తర్వాతే పనులు మొదలయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.




**హెచ్‌ఎండీఏ చేపట్టిన ప్రాజెక్టులు**

జీహెచ్‌ఎంసీ పరిధి దాటిన తర్వాత ఉన్న పలు మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల పరిధిలో హెచ్‌ఎండీఏ ప్రాజెక్టులను చేపట్టింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మైసిగండి చౌరస్తా నుంచి బౌరంపేట, బాచుపల్లి, నిజాంపేట మీదుగా మియాపూర్ వరకు రహదారిని విస్తరించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అదేవిధంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వద్ద మూసీ నదిపై హైలెవల్ బ్రిడ్జి, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హిమాయత్‌సాగర్ కింద ఉన్న ఈసా నదిపై రెండుచోట్ల హైలెవల్ బ్రిడ్జిలు, ప్రతాపసింగారం, బోడుప్పల్‌లోనూ మరో రెండు బ్రిడ్జిలను మూసీ నదిపై నిర్మించాలని టెండర్లు పిలిచారు. గత ఆగస్టులోనే వీటి నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచి గుత్తేదార్లను ఎంపిక చేశారు. ఆ తర్వాత ప్రాథమికంగా నిర్ణయించిన ప్రాంతాల్లో భూములను చదును చేయడం వంటి పనులు చేపట్టారు. అదే సమయంలో ఎన్నికలు రావడంతో ఆ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత రెండు నెలలుగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రతిపాదిత బ్రిడ్జిల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాల్లో కొత్త బ్రిడ్జిలు, రోడ్ల విస్తరణ అవసరం ఎంతో ఉన్నది. ఇప్పటికే నగరంలోని ప్రధాన రోడ్లపై తీవ్ర ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలతో నగరవాసులు నిత్యం సతమతమవుతున్నారు. కొత్తగా ఆయా ప్రాంతాల్లో ప్రతిపాదించిన బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల విస్తరణ పనులను నిర్ణీత గడువు లోగా పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తే ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నుంచి, ఎక్కువ దూరం నుంచి తిరిగి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రతిపాదిత ప్రాజెక్టుల పనులు చేపట్టాలంటే కొత్తగా వచ్చిన మెట్రోపాలిటన్ కమిషనర్ పూర్తి స్థాయిలో సమీక్ష చేసిన తర్వాత, వాటివల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటీ? ఎంత వ్యయం చేస్తున్నారు? దానికి సరిపడా నిధుల లభ్యత ఉందా? వంటి అంశాలను చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ఉత్తరాఖండ్ కేంద్రంగా నగరంలో నకిలీ ఔషధాలు

- కొరియర్ ద్వారా రెండు పార్సిల్స్ వచ్చినట్లు సమాచారం
- పలుచోట్ల డీసీఏ దాడులు ■ రూ.26లక్షల నకిలీ మందులు పట్టివేత

సిటీబ్యూరో, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా నకిలీ ఔషధాలు విక్రయిస్తున్న ఒక ఘరానా ముఠా గుట్టును రట్టుచేసి, వారి వద్ద నుంచి రూ.26లక్షల విలువైన నకిలీ మందులను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డీసీఏ అధికారుల కథనం ప్రకారం..కొరియర్ ద్వారా నగరానికి నకిలీ మందుల పార్సిళ్లు వచ్చినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు డీసీఏ అధికారులు శుక్రవారం నగరంలోని ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లోని 'ట్రాకన్ కొరియర్ సైలి' కార్యాలయాలపై దాడులు జరిపారు. ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన రెండు పార్సిళ్లను పరిశీలించగా..ఒక పార్సిల్‌లో 14.5కిలోలు, మరో పార్సిల్‌లో 13 కిలోల బరువుతో గుర్తు తెలియని పదార్థాలు కన్పించాయి. వాటిపైన 'మెషిన్ పార్ట్స్' అని, పార్సిళ్లపైన పువ్వాడ లక్ష్మణ్ అని పేర్కొనడంతోపాటు అతడి ఫోన్ నంబర్ కూడా పేర్కొని ఉన్నది. దీంతో పోలీసుల సాయంతో ఫోన్ నంబర్ ఆధారంగా పువ్వాడ లక్ష్మణ్‌ను గుర్తించి, దిల్‌సుఖ్‌నగర్‌లోని శివగంగా థియేటర్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నకిలీ ఔషధాల సరఫరాలో నగరంలోని సైదాబాద్‌కు చెందిన పోకల రమేశ్, గరపల్లి పూర్ణచందర్ కూడా కీలకపాత్ర పోషిస్తున్నట్లు తేలింది. వీరంతా ఉత్తరాఖండ్‌లోని నదీమ్ అనే వ్యక్తి నుంచి నకిలీ ఔషధాలను కొనుగోలు చేస్తున్నట్లు నిందితుడు అధికారుల విచారణలో వెల్లడించాడు.

**గోదాముల్లో రూ.26లక్షల నకిలీ ఔషధాలు సీజ్**

నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు దిల్‌సుఖ్‌నగర్‌లోని ద్వారకాపురంలో 'వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్' పేరుతో ఉన్న అతడి గోదామ్‌తోపాటు పువ్వాడ లక్ష్మణ్, పోకల రమేశ్, గరపల్లి పూర్ణచందర్ నివాసాలపై కూడా పోలీసుల సహకారంతో డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్ నుంచి కొరియర్ ద్వారా వచ్చిన రూ.26లక్షల విలువైన 8 రకాల నకిలీ ఔషధాలను అధికారులు సీజ్ చేశారు. అనంతరం ఈ ముగ్గురు నిందితులతోపాటు మరో వ్యక్తిని అధికారులు అరెస్టు చేశారు.

**బ్రాండెడ్ ముసుగులో నకిలీ మందులు**

నిందితుల వద్ద బ్రాండెడ్ కంపెనీల లేబుల్స్‌తో నకిలీ ఔషధాలు బయటపడినట్లు డీసీఏ వెల్లడించింది. సన్ ఫార్మా పేరుతో అధిక కొలెస్ట్రాల్‌కు వినియోగించే 'రొసువ' ఔషధాలు, గ్లెన్‌మార్క్ ఫార్మా పేరుతో హైపర్ టెన్షన్‌కు వినియోగించే 'టెల్మా-హెచ్ మాత్రలు, అరిస్టో ఫార్మస్యూటికల్ పేరుతో 'మోనోసెఫ్-ఓ' మాత్రలు, టొరెంట్ ఫార్మా పేరుతో పెయిన్ రిలీఫ్, వాపు తగ్గేందుకు వినియోగించే 'ఖీమోరల్ ఫోర్ట్' వంటి ఔషధాలను గుర్తించారు.

**ఉత్తరాఖండ్ అధికారులను అప్రమత్తం చేసిన తెలంగాణ డీసీఏ**

నకిలీ ఔషధాల రాకెట్ గుట్టును రట్టు చేసిన తెలంగాణ డీసీఏ అధికారులు ఉత్తరాఖండ్ డ్రగ్‌కంట్రోల్ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ నకిలీ ఔషధాల బాగోతాన్ని వారికి వివరించినట్లు తెలంగాణ డీసీఏ అధికారులు తెలిపారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బి.లక్ష్మీనారాయణ, వి.రవికుమార్, జి.అనిల్, ఎన్.క్రాంతికుమార్, ఎల్.రాజు, జె.నాగరాజు పాల్గొన్నారు.

## పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు 31 వరకు గడువు

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్మీడియట్ నుంచి ఆపై తరగతులు చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.యాదయ్య తెలిపారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ (రెన్యువల్/ఫ్రెష్) దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్ : tsepass.cgg.gov.in లో సంప్రదించాలని, ఈ విషయంలో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సహకరించాలని కోరారు.

## ముగిసిన రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ డివిజనల్‌లో 69వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం సికింద్రాబాద్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ముగిసింది. ఈ మేరకు హైదరాబాద్ భవన్ నుంచి వర్చువల్ విధానం ద్వారా రైల్వే మేనేజర్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఆధ్వర్యంలో రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశమైంది. అయితే మొత్తం 19 మంది సభ్యులకు గాను 13 మంది హాజరైనట్లు శుక్రవారం రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## ఓబీసీ కులగణనతో సామాజిక న్యాయం

రవీంద్రభారతి, డిసెంబర్ 29 : 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలో ఓబీసీ కులగణన నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ నాగపూర్ ప్లీనరీలో ప్రకటించడంపై అఖిలభారత ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ స్వాగతించారు. జనాభా గణనలో కులగణన నిర్వహిస్తే ఓబీసీలకు నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన నిర్వహించక ఓబీసీలు అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కులగణన డిమాండ్‌పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందని ప్రశ్నించారు. దేశంలో సంక్షేమ చర్యలు తీసుకోవడానికి జనాభా ప్రాతిపదికన ఓబీసీ కులగణనకు కట్టుబడి ఉండే పార్టీలకే ఓబీసీల మద్దతు ఉంటుందని ఆళ్ల రామకృష్ణ వెల్లడించారు.


ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మ నారాయణ

## న్యాయ వ్యవస్థలో బడుగులకు న్యాయం జరగడంలేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం మాట నిలబెట్టుకోవాలి
- ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్ నారాయణ

ఖైరతాబాద్, డిసెంబర్ 29: న్యాయ వ్యవస్థలో బడుగు, బలహీన వర్గాలకు సముచిత న్యాయం జరగడంలేదని ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్ నారాయణ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయమే జరుగుతున్నదన్నారు. గడిచిన 75 ఏండ్ల కాలంలో ఒక్కరూ కూడా ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారికి అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పదవులు వచ్చిన దాఖలాలు లేవన్నారు. స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర పోస్టుల్లోనూ వెనుకబాటుకు గురవుతున్నామని తెలిపారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో సామాజిక న్యాయం అంశాన్ని పెట్టిందని, న్యాయ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు ఈ.భీమారావు, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, గంగాధర్ గౌడ్, డాక్టర్ రవికుమార్, దున్న అంబేద్కర్, కమలాకర్, రాకేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## రిపబ్లిక్‌డే పరేడ్‌కు 128 మంది క్యాడెట్లు

**ఢిల్లీకి పయనమైన ఏపీ, టీఎస్ బృందం**

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రిపబ్లిక్‌డే క్యాంప్ కోసం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ నుంచి ఎన్‌సీసీ బృందం శుక్రవారం ఢిల్లీకి బయలుదేరినట్టు డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 1.30 లక్షల మంది క్యాడెట్లను పరీక్షించి, 128 మందిని ఎంపిక చేశారని చెప్పారు. ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ ద్వారా ప్రతి గ్రూప్ నుంచి వారిని ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం ముగిసిన తర్వాత జనవరి 30వ తేదీన హైదరాబాద్‌కు తిరిగి వస్తారని ఆయన వివరించారు. ఈ క్యాడెట్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడాకారుల అభిరుచిని బట్టి క్రీడలకు ప్రోత్సాహం

**ఎస్‌బీఐ ముంబై కార్పొరేట్ సెంటర్ డీఎండీ(హెఆర్) అండ్ సీడీవో మిశ్రా**




జూబ్లీహిల్స్, డిసెంబర్ 29 : క్రీడాకారుల అభిరుచిని బట్టి దేశ వ్యాప్తంగా అన్ని బ్రాంచ్‌లలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఎస్‌బీఐ ముంబై కార్పొరేట్ సెంటర్ డీఎండీ (హెఆర్) అండ్ సీడీవో ఓ.పి.మిశ్రా అన్నారు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ముగిసిన 'ఆలిండియా ఎస్‌బీఐ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్' పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆయన అభినందించారు. పోటీల్లో ఎస్‌బీఐ బెంగళూరు సర్కిల్ ప్రథమ బహుమతితో విన్నర్‌గా, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ ద్వితీయ స్థానంతో రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్, అమరావతి సీజీఎం నవీన్‌చంద్ర ఝా తదితరులు పాల్గొన్నారు.